పద్మశాలీలు రాజకీయంగా ఎదుగడానికి కృషి చేయాలి

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కోరిన పద్మశాలీ సంఘం నాయకులు

భూదాన్ పోచంపల్లి : హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సత్కరించి రాట్నం బహూకరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆలేరు టౌన్, డిసెంబర్ 2 : స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలకు అత్యధికంగా సీట్లు కేటాయించి రాజకీయంగా ఎదుగడానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అఖిల భారత పద్మశాలీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదిగినప్పుడే ఆ వర్గానికి సమాజంలో సముచిత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో పద్మశాలీలకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని ఎమ్మెల్సీని కోరగా.. ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎమ్మెల్సీ కవితను కలిసిన వారిలో పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, మాజీ జడ్పీటీసీలు బోళ్ల శివశంకర్, బొట్ల పరమేశ్వర్, సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూప, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

భూదాన్ పోచంపల్లి : మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసి చేనేత శాలువాతో సత్కరించి రాట్నాన్ని బహూకరించారు. శాసన మండలిలో చేనేత సమస్యలపై గళం విప్పాలని, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. కవితను కలిసిన వారిలో చేనేత రాష్ట్ర నాయకుడు కర్నె ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు చింతకింది కిరణ్, మంగళపల్లి శ్రీహరి, కటికం శ్యామ్, సిద్ధుల ప్రభాకర్ ఉన్నారు.

నార్మూల్ నిర్వహణలో విఫలం

● పాడి రైతులకు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ ఏమైంది

● నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 2 : నార్మూల్ డెయిరీ రూ.55 కోట్ల నష్టాల్లో కొనసాగుతుందని గత పాలకవర్గ సమావేశంలో తీర్మానించారని, బైలా ప్రకారం నష్టాల్లో ఉన్న సంస్థను ఎలా కొనసాగిస్తారో రంగారెడ్డి డీసీఓ చెప్పాలని నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి అన్నారు. బైలా ప్రకారం ఎన్నికలు నిర్వహించలేదని, తమ పాలవర్గాన్ని రద్దు చేసిందని, బైలా ప్రకారం నష్టాల్లో ఉన్న సంస్థను ఎందుకు రద్దు చేయడం లేదో డీసీఓ చెప్పాలని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థకు తాను రూ.46 కోట్ల నష్టం చేశానని, తన పదవీ కాలంలో ఉద్యోగుల పదోన్నతి, రెగ్యులరైజ్ చేయడంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని, సీబీఐ విచారణ జరిపించినా తాను సహకరిస్తానని సవాల్ చేశారు. అధికారంలోకి రాగానే దసరాలోపు 2 నెలల పాల బకాయి బిల్లును క్లియర్ చేస్తామని, 4 రూపాయల బోనస్ ప్రకటిస్తామని మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రస్తుతం పాడి రైతులకు 3 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎన్సీడీఎఫ్ఐ ఈ మార్కెట్ ప్రకారం కిలో వెన్న రూ.385కు విక్రయించాలని తెలిపారు. ఇటీవల కరీంనగర్ డెయిరీ సంస్థ వెన్న కిలోకు రూ.385 ధర చొప్పున విక్రయించిందని చెప్పారు. నార్మూల్ డెయిరీ రూ.45 తగ్గించి రూ.340కే విక్రయించడంపై సొసైటీ చైర్మన్ గుడిపాడి మధుసూదన్‌రెడ్డి వివరణ ఇవ్వాల్సిందిపోయి తన ఆరోపణను తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎన్నికలు నిర్వహించలేదన్న సాకుతో అప్పటి డీసీఓ తన పాలకవర్గాన్ని రద్దు చేస్తే హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకుని పాలకవర్గాన్ని కొనసాగించానని చెప్పారు. కోర్టులో కేసు ఉండగానే ఎన్నికలు ఎలా పెట్టారో డీసీఓ వివరణ ఇవ్వాలన్నారు. 23 ఏండ్లుగా విధుల్లో ఉన్న 200 మంది ఉద్యోగులను ఒక్క పైసా తీసుకోకుండా పదోన్నతులు కల్పించామని, 235 మంది ఉద్యోగులను పర్మినెంట్ చేశామని చెప్పారు. తమ పాలనలో రోజుకు 90వేల లీటర్ల పాలను విక్రయించామని, ప్రస్తుతం 40వేల లీటర్లు మాత్రమే విక్రయిస్తున్నారని తెలిపారు. ఇలా కొనసాగితే సంస్థ లాభాల్లోకి ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఉద్యోగులకు రూ.2లక్షల బీమాను రూ.5లక్షలకు పెంచామని, ప్రస్తుత చైర్మన్ దానిని రూ.2 లక్షలకు కుందించారని అన్నారు. సంస్థ లాభాల్లో ఉన్న మాట అవాస్తవమని, సంస్థను సక్రమంగా నడిపించడంలో ప్రస్తుత చైర్మన్ విఫలమయ్యారని ఆరోపించారు.

సమావేశంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్లు మారెడ్డి కొండల్‌రెడ్డి, సందిళ్ల భాస్కర్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకుడు పాండవుల భాస్కర్‌గౌడ్, పాడి రైతులు పాల్గొన్నారు.

వైకుంఠ ద్వారం వద్ద వెలిసిన షాపును తొలగించాలి

● బీఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ నరహరి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ నరహరి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 2 : దేవస్థాన నిబంధనలకు విరుద్ధంగా స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద వెలిసిన షాపును వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. ఆలయ ఈఓ భాస్కర్ రావు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గుట్టుచప్పుడు కాకుండా టెండర్లు వేసి షాపులకు అనుమతి ఇవ్వడంపై తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. ఆలయ ఈఓ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఇష్టారాజ్యంగా దుకాణాలను కేటాయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, దుకాణాదారులకు సమస్యలు లేకుండా అభివృద్ధి చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిబంధనలకు విరుద్ధంగా వైకుంఠ ద్వారం వద్ద గిరి ప్రదక్షిణ రోడ్డులో మెట్ల మార్గంలో టీ, స్నాక్స్ స్టాల్ ఏర్పాటు చేయడమేంటని ప్రశ్నించారు. ఆ షాపుతో గిరి ప్రదక్షిణకు, కొండపైకి వెళ్లే భక్తులకు తీవ్ర అటంకం ఏర్పడుతుందన్నారు. కొండపైన మరో 15 దుకాణాలకు అనుమతి ఇస్తున్నారని, వాటికి ఓపెన్ టెండర్ ద్వారా కేటాయించాలని డిమాండ్ చేశారు. వైకుంఠ ద్వారం వద్ద దుకాణాన్ని తొలగించకపోతే ఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ముక్కర్ల సతీశ్, పట్టణ అధికార ప్రతినిధి అంకం నర్సింహ, నాయకులు పాండవుల భాస్కర్‌గౌడ్, వాసం రమేశ్, ఎండీ యాకూబ్, దండబోయిన వీరేశం, గ్యాదపాక క్రాంతి, నజీర్ పాల్గొన్నారు.

'దేశ రక్షణ, సామాజిక సేవే ఆర్ఎస్ఎస్ లక్ష్యం'

ఆలేరు టౌన్, డిసెంబర్ 2 : హిందూ సంఘటన, దేశ రక్షణ, సామాజిక సేవే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పని చేస్తుందని ఆ సంఘం నల్లగొండ విభాగ్ కార్యవాహ మంత్రి ప్రగడ శ్రీధర్ అన్నారు. ఆలేరులోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి నేటికి వంద సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఆర్ఎస్ఎస్ అంటే గిట్టని సంస్థలు ఎన్ని ఆటంకాలు కలిగించినా అధిగమిస్తూ తన కార్యకలాపాలను నిరాటంకంగా కొనసాగిస్తుందని చెప్పారు. అంతకుముందు పట్టణంలో స్వయం సేవకులు కవాతు నిర్వహించారు.

కార్యక్రమంలో ఎస్ఆర్‌కేవీ ఆచార్యులు బండిరాజుల శంకర్, కమటం రమేశ్, కటకం లక్ష్మణ్, కుండె మధు, పసుపునూరి వీరేశం, తోట మల్లయ్య, బందెల సుభాశ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో శాస్త్రోక్తంగా నిత్యోత్సవాలు

స్ఫటికలింగేశ్వరుడికి హారతి ఇస్తున్న శివాలయ ప్రధానార్చకుడు నరసింహరాములు శర్మ

యాదగిరిగుట్ట, డిసెంబర్ 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో నిత్యోత్సవాలు శాస్త్రోక్తంగా సాగాయి. సోమవారం ఉదయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన అత్యంత వైభవంగా జరిపారు. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కు జోడు సేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, సహస్రనామార్చన, శయనోత్సవ సేవలు వైభవంగా జరిగాయి. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటికలింగేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేపట్టారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.34,44,195 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

భువనగిరి ఖిలాపై తెలంగాణ రైజింగ్ లైటింగ్ ఏర్పాటు

భువనగిరి ఖిలాపై ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ లైటింగ్

భువనగిరి అర్బన్, డిసెంబర్ 2 : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పట్టణంలో మంగళవారం 2కే రన్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పాత బస్టాండ్ వరకు, అక్కడి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు 2కే రన్ ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు అర్బన్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, 3గంటలకు రావి భద్రారెడ్డి గార్డెన్‌లో మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ, సీసీ కెమెరాల ప్రారంభోత్సవం, పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలో పట్టణంలోని భువనగిరి ఖిలాపై తెలంగాణ రైజింగ్ లైటింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు.

కేజీబీవీ కళాశాలలో మ్యాథ్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 2 : పట్టణంలోని కేజీబీవీ కళాశాలలో పీజీ సీఆర్‌టీ మ్యాథ్స్ బోధించుటకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.సంతోషి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు మాత్రమే అర్హులని, పీజీ మ్యాథ్స్, బీఈడీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 3 నుంచి 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత పత్రాలతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పీఈటీ పోస్టుకు దరఖాస్తులు

గుండాల, డిసెంబర్ 2 : మండల కేంద్రంలోని కేజీబీవీలో పీఈటీ పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్ఓ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీతోపాటు బీపీఈడీ (వ్యాయామ విద్య) కలిగిన వారు ఈ పోస్టుకు అర్హులని, యాద్రాది భువనగిరి జిల్లా వాసులై ఉండాలని, పేర్కొన్నారు.తాత్కాలిక పద్ధతిలో నియామకం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన వారు డిసెంబర్ 4, 5 తేదీల్లో సాయంత్రం 5లోపు గుండాల కేజీబీవీలో నేరుగా వచ్చి దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

పాడి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

రాజపేట, డిసెంబర్ 2 : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా మదర్ డెయిరీ ముందుకు సాగుతుందని సొసైటీ చైర్మన్ రామిడి బాబురెడ్డి అన్నారు. మండలంలోని నర్సాపూర్ పాల సొసైటీ పాడి రైతు పేరాల గణేశ్ అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయన కుటుంబానికి స్థానిక పాల కేంద్రం మేనేజర్ మాధవరం శేఖర్ ఆధ్వరంలో సోమవారం రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో పాల సంఘం డైరెక్టర్లు ఎమ్మ ఎల్లయ్య, అంబేద్కర్, రామచంద్రం, శేఖర్, వెంకటేశం, సంజీవరెడ్డి, భాస్కర్, లక్ష్మణ్, శ్రీను, సూపర్‌వైజర్ రాములు, సిబ్బంది మహేందర్ పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ హనుమంతరావు

ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 2 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై అధికారులు అలసత్వం వహించవద్దన్నారు. ప్రజావాణిలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి 64 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు-39, జిల్లా పంచాయతీ అధికారికి-10, శిశు సంక్షేమ శాఖకు-5, విద్యాశాఖకు-2, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి-2, ఇరిగేషన్ ఈఈ, వైద్య ఆరోగ్య, మున్సిపాలిటీ, దేవాదాయ శాఖ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అందాయని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, జడ్పీ సీఈఓ శోభారాణి, కలెక్టరేట్ పరిపాలనా అధికారి జగన్మోహన్‌ప్రసాద్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నారెడ్డి

మోటకొండూర్ : గురుకుల పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నారెడ్డి

చౌటుప్పల్/ మోటకొండూరు/ మోత్కూరు, డిసెంబర్ 2 : వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నారెడ్డి అన్నారు. సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం మోడల్ స్కూల్‌ను, మోటకొండూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను, మోత్కూరులోని ఎస్సీ, బీసీ బాలికల, బాలుర సంక్షేమ హాస్టళ్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదులు, స్టాక్ రూమ్, ఆహార పదార్థాలు, కూరగాయలను పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని వంట సిబ్బందికి సూచించారు. సంక్షేమాధికారులు విధుల పట్ల అలసత్వం చూపవద్దని, రోజువారీగా వంటలను పరిశీలించాలని అన్నారు. విద్యార్థుల భోజనంలో నాణ్యత లోపించవద్దని సూచించారు.

కార్యక్రమాల్లో డీఈఓ సత్యనారాయణ, ఎంఈఓలు గురువారావు, కేతిరెడ్డి రఘురాంరెడ్డి, ఎస్సీ, బీసీ సంక్షేమాధికారులు జైపాల్ రెడ్డి, బి.యాదయ్య, ప్రిన్సిపాల్స్ హజారయ్య, జ్యోతి పాల్గొన్నారు.

విద్యా సంస్థలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి : డీఎస్ఓ

బియ్యం గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న డీఎస్ఓ వనజాత

మోత్కూరు, డిసెంబర్ 2 : ప్రభుత్వ విద్యా సంస్థలకు నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేయాలని డీఎస్ఓ వనజాత అన్నారు. మోత్కూరు సివిల్ సప్లయ్ బియ్యం గోడౌన్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా మండలంలోని పాటిమట్ల గోడౌన్‌ను పరిశీలించారు. గోడౌన్‌లోని పీడీఎస్, సన్న బియ్యం, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి, గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు అందించే సన్న బియ్యం నాణ్యమైనవిగా ఉండాలన్నారు. రేషన్ షాపులకు బియ్యం ఏకకాలంలోనే అందించాలని ఆదేశించారు. ఆమె వెంట ఏఎస్ఓ రోజారాణి, గోడౌన్ ఇన్‌చార్జి లాయక్ అలీ, ఆర్ఐ వంశీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కు అందజేత



పరశురాములు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

వలిగొండ, డిసెంబర్ 2 : మండలంలోని ఎం.తుర్కపల్లి గ్రామానికి బీఆర్ఎస్ కార్యకర్త మాసంపల్లి పరశురాములు ఇటీవల మృతి చెందాడు. ఆయన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ బీమా కలిగి ఉండడంతో రూ.2లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో సోమవారం పరశురాములు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎడ్ల నిరంజన్‌రెడ్డి, నాయకులు నర్సింహ, ఐలయ్య, వెంకటేశ్, స్వామి, లింగయ్య, నవీన్, కన్నయ్య, కృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

చౌటుప్పల్, డిసెంబర్ 2 : పట్టణంలోని సర్వీస్ రోడ్డు వెంట నిర్మిస్తున్న కాల్వ, నాగుల కుంట సుందరీకరణ, గాంధీ పార్కు డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు సంబంధిత శాఖల అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను గురించి చర్చించారు. వరద కాల్వ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ హరికృష్ణ, ఇరిగేషన్ డీఈ రాజవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వరద కాల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు, అధికారులు

బీఆర్ఎస్ నాయకుడి మృతికి నివాళి

రామన్నపేట, డిసెంబర్ 2 : మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం మండల కార్యదర్శి బొజ్జ కోటమ్మ భర్త శ్రవణ్ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కోటమ్మ కుటుంబాన్ని పరామర్శించి శ్రవణ్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ గ్రామ శాఖ అధ్వర్యంలో రూ.21వేల ఆర్థిక సాయం అందజేశారు. జనంపల్లి బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు వేమవరపు సుధీర్‌బాబు రూ.5వేలు, నీర్నెముల మాజీ ఎంపీటీసీ రాంసునీత రూ.6వేల ఆర్థిక సాయం చేశారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోచబోయిన మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లం సతీశ్, నాయకులు నరేందర్, శ్రీధర్, రవీందర్, శివప్రసాద్, శేఖర్ రెడ్డి, రమేశ్, శంకర్, లక్ష్మీనారాయణ, రాంకాశి, సత్యం, తరుణ్ ఉన్నారు.

మోత్కూరు మార్కెట్ చైర్‌పర్సన్‌కు మంత్రి కోమటిరెడ్డి ఆశీస్సులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విమల

మోత్కూరు, డిసెంబర్ 2 : మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నూనెముంతల విమలావెంకటేశ్వర్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆశీస్సులు పొందారు. సోమవారం హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి వెళ్లి పూల బొకే అందజేసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ను మంత్రి శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, నాయకులు ద్యాప కృష్ణారెడ్డి, లింగాల భిక్షం, ఏలూరి రాంరెడ్డి, ఈరసరపు యాదగిరి ఉన్నారు.

పగిడిపల్లిలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ప్రారంభం

● వర్చువల్ విధానంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులను వెలిగించి ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్, అధికారులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 2 : ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని పగిడిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ నర్సింగ్, పారా మెడికల్ కాలేజీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లడుతూ రాష్ట్రంలో 28 పారామెడికల్, 16 నర్సింగ్ కాలేజీలు, 32 ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు. యాదాద్రి మెడికల్ కాలేజీలో 50 సీట్లు, నర్సింగ్ కాలేజీకి 60 సీట్లు కేటాయించారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కొవ్వొత్తులు వెలిగించి ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్ర, జిల్లా వైద్యాధికారి మనోహర్, కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం : ఎమ్మెల్యే, కలెక్టర్

రక్తదాన శిబిరంలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 2 : మనం చేసే రక్తదానం వేరొకరికి ప్రాణదానం అవుతుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది 104 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, జగన్మోహన్‌ప్రసాద్, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి